
## 55 ఏండ్లలో కనీసం
# తాగునీళ్లివ్వలే..

- ప్రతిపక్షాలు కులం, మతంపేరిట ఓట్లు అడుగుతున్నరు
- రెండున్నరేండ్లు ఎమ్మెల్యేగా ఉండి పదేండ్లు కనిపించలే..
- అభివృద్ధే బీఆర్‌ఎస్ అభిమతం: ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


హన్వాడ: మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రసంగాన్ని వింటున్న గ్రామస్తులు

హన్వాడ, నవంబర్ 23 : 55ఏండ్ల పాలనలో కనీసం తాగునీళ్లివ్వని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఓట్ల కోసం గ్రామాల్లోకి వస్తున్నారని.. వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం కొనగట్టుపల్లి, యారోనిపల్లి గ్రామాల్లో ఆయన ప్రచారం చేపట్టగా ప్రజలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 11సార్లు అధికారంలో ఉండి తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లెలను ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ప్రతి గ్రామానికి బీటీరోడ్లు, ఇంటి చెంతకే నీళ్లు తెచ్చిందన్నారు. కాంగ్రెసోళ్లు రూ.200 పింఛన్ ఇస్తే తమ హయాంలో విడుతల వారీగా రూ.2,016కు పెంచామన్నారు. వచ్చే జనవరి నుంచి వృద్ధులకు రూ.5,016, దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని చెప్పారు. అభివృద్ధిని ఆశీర్వదించి మరోసారి పట్టం కట్టాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి కులం పేరుతో ఓట్లు అడుగుతున్నడు, బీజేపీ ఆయనేమో మతం పేరిట పల్లెల్లోకి వస్తున్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాళ్లు ఓడిపోతే మరో ఐదేండ్లు కనుమరుగవుతారని ఎద్దేవా చేశారు. ''మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే దళితుల భూములను లాక్కుంటారని ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు.. ఎట్టి పరిస్థితిలో దళితుల భూములు తీసుకునేదిలేదు.. దానికి నేనే బాధ్యత'' అని మంత్రి హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, కారు గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, సర్పంచులు మానస, సుధ, ఎంపీటీసీ చెన్నయ్య, కరుణాకర్‌గౌడ్, రాజుయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కారు గుర్తుకు ఓటు వేయాలని రాములవ్వను అభ్యర్థిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మహబూబ్‌నగర్ టౌన్: మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తిలకం దిద్దుతున్న మహిళ

### ప్రతిపక్షాలవి కుల రాజకీయాలు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబర్ 23 : బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుల, మతరాజకీయాలు చేస్తాయని, బీఆర్‌ఎస్ అభివృద్ధే అభిమతంగా పనిచేస్తున్నదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సద్దలగుండులో శ్రీనివాస్‌గౌడ్ ప్రజలు ఘనస్వాగతం పలుకగా కార్నర్ మీటింగ్‌లో మంత్రి ప్రసంగించారు. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గతంలో బీజేపీ ఎమ్మెల్యేగా రెండున్నరేళ్లు పాలించి మత కలహాలకు కారణమయ్యారని విమర్శించారు. అలాంటి వ్యక్తిని పొరపాటున గెలిపిస్తే మళ్లీ అలా జరగదని గ్యారెంటీ లేదన్నారు. కండువా మారినంత మాత్రాన వారి బుద్ధి మారదని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు శాంతి భద్రతలు, మతసామరస్యం కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని తెలిపారు. తమ పదేళ్ల పాలనతో కాంగ్రెస్ పాలనను పోల్చి చూస్తే జరిగిన అభివృద్ధి అర్థమవుతుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్‌తో పదేండ్లలో రూ.30కోట్లు సాయం అందించి ప్రజల ప్రాణాలు కాపాడామన్నారు. నిర్మాణంలో ఉన్న వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తాము చేస్తున్న అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలీశ్వరి, ముడా డైరెక్టర్ సాయిలు, నాయకులు వెంకట్రాములు, ఇస్మాయిల్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


మక్తల్‌లో మంత్రి కేటీఆర్ కాన్వాయ్


కేటీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు


అభిమాన నేత కేటీఆర్ కోసం డీసీఎంలో తరలొస్తున్న యువత


కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

# కాంగ్రెస్‌కు ఓటేస్తే గడ్డుకాలమే..

- ఇందిరమ్మ రాజ్యం వస్తే చీకటి బతుకులే..
- 'భూమాత'లో కాలం పెడితే బతుకులు ఆగమే..
- కాంగ్రెస్ కావాలా..? కరెంట్ కావాలా..? తేల్చుకోవాలి
- ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్
- రూ.200 పింఛన్ ఇవ్వనోళ్లు.. రూ.4 వేలు ఇస్తారంటే నమ్ముదామా..?



మహబూబ్‌నగర్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ కావాలా..? కరెంట్ కావాలా..? మళ్లీ చీకటి ఇందిరమ్మ రాజ్యం కావాలా..? అనేది తేల్చుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే గడ్డు కాలమే వస్తుందని, ధరణి తీసేసి కాలం విధానం ప్రవేశపెడితే బతుకులు ఆగమవుతాయన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ గురువారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్‌లో మంత్రి మాట్లాడుతూ గాడిదలకు గడ్డి ఏసి ఆవులకు పాలు పిండితే వస్తాయా..? ముండ్ల చెట్టుకు నీళ్లు పోసి పండ్లు కావాలంటే కాస్తాయా..? కాంగ్రెసోళ్లకు ఓటేస్తే పనులవుతాయా..? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల కోసం సీఎం కేసీఆర్ కొన్ని ఎన్నో మంచి పనులు చేసిండు.. వాస్తవమా..? కాదా? ఆసరా పింఛన్లు ఇచ్చింది ఎవరు.. కల్యాణలక్ష్మి తెచ్చింది ఎవరు.. రైతుబంధు తెచ్చింది ఎవరు.. కేసీఆర్ కిట్లు ఇచ్చింది ఎవరు.. తండాలను పంచాయతీలు చేసింది ఎవరు.. రైతుబీమా ఇచ్చింది ఎవరు.. షాదీ ముబారక్ స్కీం పెట్టింది ఎవరు..? సీఎం కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. ఇన్ని మంచి పనులు చేసిన కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే.. మాకేం చేస్తున్నారని కొంతమంది ఆడబిడ్డలు అడుగుతున్నారు. మా అత్తలకు ఆసరా పింఛన్లు ఇస్తున్నారు..? మాకు ఏమిస్తారని ఆలోచిస్తున్నారు..? నిజమా కాదా..? అని మహిళలను అడిగారు. డిసెంబర్ 3న మన రామన్న గెలిచిన తరువాత కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాక కొన్ని కొత్త పథకాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలందరికీ సౌభాగ్యలక్ష్మి పథకం కింద నెలకు రూ.3 వేల భృతిని అందజేస్తామన్నారు. దీంతోపాటు మరో నాలుగు కొత్త పథకాలు ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. 2014లో ప్రధాని మోదీ గద్దెనెక్కేటప్పుడు గ్యాస్ సిలిండర్ ధర రూ.400 చేస్తానని మాట ఇచ్చి నేడు ధరలు పెంచుతూ మన వీపుల మీద గుద్దుతున్నాడన్నారు. రూ.వెయ్యికి గ్యాస్ ధర చేరిందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో వచ్చిన తరువాత అర్హులకు రూ.400కే సిలిండర్ అందజేస్తామన్నారు. రేషన్ కార్డులు లేని వారికి మళ్లీ కొత్త కార్డులు అందజేసి.. తెల్లరేషన్ కార్డులు ఉన్నోళ్లందరికీ జనవరి నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తామన్నారు. భూమి ఉన్నోళ్లకే బీమా ఇస్తున్నారు..? మరి లేనోళ్ల సంగతి ఏందని ప్రజలు అడుగుతున్నారు.. తెల్లరేషన్ కార్డు ఉంటే చాలు రైతుబీమా మాదిరిగా కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికీ ధీమా పేరిట రూ.ఐదు లక్షల బీమా సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. అసైన్డ్ భూములు, పట్టా భూములు ఉన్న వారికి సంపూర్ణ హక్కులు ఇస్తామన్నారు. మేమేం చేశాం.. గెలిచాక ఏం చేస్తామనేది కూడా వివరిస్తామన్నారు. అలాంటి ధైర్యం బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందన్నారు. 'మూడు గంటల కరెంట్ బదులు కేసీఆర్ అనవసరంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నాడు.. 10 హెచ్‌పీ మోటర్లు మూడు గంటల్లో మూడు ఎకరాలకు పారుతది..' అంటూ రేవంత్‌రెడ్డి చెబుతున్నాడన్నారు. 10 హెచ్‌పీ మోటర్లు ఎవరికైనా ఉన్నాయా అని ప్రశ్నించగా.. ఎవరికీ లేవంటూ రోడ్‌షోకు వచ్చిన వారు తెలిపారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే కరెంటు వైర్లను ముట్టుకొని చూడాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేతలకు ఏసీ బస్సులు పెడతాను.. వెంకట్‌రెడ్డి లేదా రేవంత్‌రెడ్డి వచ్చి మక్తల్ నియోజకవర్గంలో ఏ గ్రామానికైనా వెళ్లి కరెంట్ వైర్లను ముట్టుకొని రావాలన్నారు. కరెంటు గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని.. వారి హయాంలో కరెంటు సరిగా లేక కాలిపోయిన మోటర్లు.. పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, రాత్రిపూట పొలాల వద్ద జాగరం చేసింది మరచిపోదామా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే కరువు కాటకాలు, గంజి కేంద్రాలు, నక్సలైట్ల ఎన్‌కౌంటర్లు అని గుర్తుచేశారు. ఎరువులను పోలీస్‌స్టేషన్లో పెట్టి క్యూ లైన్లలో అమ్మేవారన్నారు. పక్కనే ఉన్న కర్ణాటకకు ఇక్కడి నుంచి మూడు బస్సులు పెడతాను.. మీరందరూ పోయి అక్కడి పరిస్థితి ఎలా ఉందో చూసి రావాలని కోరారు. అధికారమిచ్చిన ఆరు నెలలకే రైతుల నోట్లో మట్టి కొట్టి కరెంటు ఇవ్వక చేతులు కట్టేశారని.. గ్యారెంటీలన్నీ అటక్కెంచారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రూ.200 పింఛన్ ఇచ్చి ఇప్పుడేమో రూ.4000 ఇస్తామంటున్నారు.. ఇది చూస్తుంటే 'అమ్మకు గాజులు పెట్టనోడు.. పిన్నికి బంగారు గాజులు పెడతాడంట' సామెతను తలపిస్తున్నదన్నారు. రేవంత్‌రెడ్డి ఏమో మూడు గంటల కరెంటు చాలా అంటున్నాడు.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏమో రైతుబంధు వేస్ట్ అంటున్నాడని, 24 గంటల కరెంట్, రైతుబంధు కావాలంటే బీఆర్‌ఎస్‌కు.. వద్దనుకుంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని చెప్పారు. రైతుబంధును ఎత్తేద్దాం అని ఒకరంటుంటే.. రూ.16 వేలు ఇస్తామని మరొకరు అంటున్నారని.. వారిలో వారికే క్లారిటీ లేదని మండిపడ్డారు. కరెంటు ఉంటే కాంగ్రెస్ ఉండదు.. కాంగ్రెస్ ఉంటే కరెంటు అసలే ఉండదని.. ఇది పక్కా అని అన్నారు. భట్టి విక్రమార్క ఏమో ధరణి తీసేస్తా.. మళ్లీ పాత పట్వారీ వ్యవస్థ తీసుకొస్తా అని అంటున్నాడు.. మల్లా కావాలనా పట్వారీ వ్యవస్థ? మల్లా దళారులు కావాల్నా.. లంచగొండులు కావాల్నా.. అని ప్రశ్నించారు..? ఇవాళ ధరణిలో మొత్తం అధికారం మీ చేతిలో ఉంది.. ఏదైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే ఉండొచ్చు కానీ.. ఎలుకలు ఉన్నాయని ఇల్లు కాల పెట్టుకోలేము కదా? అన్నారు. మంచి పనులు చేసిన ప్రభుత్వం, మంచినీళ్లు ఇచ్చిన ప్రభుత్వం, సాగునీరు ఇచ్చిన ప్రభుత్వం. కల్యాణ లక్ష్మి ఇచ్చిన ప్రభుత్వం, రైతుబంధు ఇచ్చిన ప్రభుత్వం, రైతుబీమా ఇచ్చిన ప్రభుత్వం, గ్రామాల్లో బ్రహ్మాండంగా మంచి పనులు చేసిన ప్రభుత్వం.. మనదన్నారు. మంచి ఎమ్మెల్యేగా చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఉన్నారని, ఈయన వైపు కాకుండా వేరే వేపు చూస్తే మనమే నష్టపోతామన్నారు. కాంగ్రెస్ పార్టీ కొత్తది కాదు.. ఆ పార్టీకి 11 సార్లు అధికారం ఇచ్చామని, మళ్లీ ఒక్క ఛాన్స్ అంటూ అడుక్కుంటుందని విమర్శించారు. గతంలో వారి పాలన తెలిసిందే.. కారు గుర్తుకు ఓటేసి మళ్లీ అభివృద్ధికి సహకరించాలని, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా నాయకురాలు సుచరితారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మక్తల్ ఇన్‌చార్జి ఆంజనేయగౌడ్, నాయకులు శ్రీనివాస్ గుప్తా, మహిపాల్ రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చిట్టెంను గెలిపించండి: సుచరిత

రోడ్ షోకు హాజరైన కార్యకర్తలు, ప్రజల ఉత్సాహం చూస్తుంటే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయమైందని ఎమ్మెల్యే చిట్టెం సతీమణి సుచరిత అన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి చిట్టెంను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పక్కనే ఉన్న కర్ణాటక ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, ఇక్కడ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తుందన్నారు. వారికి ఓటేస్తే నష్టపోతామన్నారు. రోడ్ షో సక్సెస్‌కు సహకరించిన కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

### శక్తివంచన లేకుండా కృషి చేశా..

ఊట్కూర్, (మక్తల్) నవంబర్ 23 : మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మక్తల్‌తోపాటు ఆత్మకూర్, అమరచింత పట్టణాలను మున్సిపాలిటీలుగా చేసుకున్నామన్నారు. మరోమారు తనను భారీ మెజారిటీతో గెలిపించాలని, నిరంతరం అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.



### మక్తల్‌కు కేటీఆర్ వరాల జల్లు..

మక్తల్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తామని, ఆత్మకూర్‌లో వంద పడకల దవాఖాన, నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల్లో స్టేడియంల నిర్మాణం, చంద్రగఢ్ కోటకు పర్యాటక శోభ, భూత్‌పూర్ రిజర్వాయర్ కాల్వల నిర్మాణం, మక్తల్ నుంచి నారాయణపేటకు ఫోర్‌లైన్ నిర్మిస్తామన్నారు. మక్తల్ ఉర్దూ మీడియం పాఠశాలకు నూతన బిల్డింగ్, ఊట్కూర్‌లో అధునాతన బస్టాండ్, ఎస్సీ, బీసీ, మైనార్టీ, తండాల పంచాయతీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలకు ప్రజలు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.




మక్తల్ రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్


గులాబీమయమైన మక్తల్ అంబేద్కర్ చౌక్